

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

జనవరి 2025




పాఠకులకు 3వవార్షికోత్సవ
శుభాకాంక్షలు



పూజ్య గురుదేవులు
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారికి
జన్మదివస శుభాకాంక్షలు



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక
ఏలూరు

జనవరి , 2025
సంపుటి-4
సంచిక-1

# విషయ సూచిక

| సంఖ్య | శీర్షిక | రచయిత |
| --- | --- | --- |
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 04 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 09 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

శ్రీ మహాగణాధిపతయే నమః                శ్రీ గురుభ్యోనమః                శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (౯ రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## పుష్యం- పుణ్యాకృష్యం

ఒక చోట నుండి వేరొక చోటికి వెళ్లడాన్ని క్రాంతి అంటారు. సూర్య భగవానుడు ఒక రాశి నుండి మరొక రాశిలోనికి ప్రవేశించడాన్ని సంక్రాంతి అంటారు. ధనూరాశి నుండి మకర రాశిలోనికి ప్రవేశించడమే మకర సంక్రాంతి. ఈ ప్రవేశంతో ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమవుతుంది. ఉత్తరాయణము దేవతలు భూలోకంలో సంచరించే కాలం. స్వర్గలోకపు ద్వారాలను తెఱచి ఉంచేకాలం. సాధారణ స్థితిలో ఎంతో పుణ్యం చేసిన వారి వారికే స్వర్గద్వారాలు తెరవబడుతాయి ఉత్తరాయణాల్లో స్వల్పపుణ్యాలకు కూడా తెరవబడతాయి. అందుకే భీష్ముడు ఉత్తరాయణం వచ్చేదాకా జీవించాడు. ఈ కాలంలో చేసే పుణ్యం అనంతఫలం ఇస్తుంది.మన భారతదేశం ఒక వ్యవసాయాధారిత దేశం. ఇక్కడి పండుగలు, ఉత్సవాలు వ్యవసాయం మీద ఆధారపడి ఉంటాయి. నూతనంగా పండిన పంటలు చేతికి వస్తాయి.అందువల్ల రైతులు ఆనందోత్సాహాలతో సంక్రాంతి జరుపుకొనేవారు. ఈ పండుగను భోగి, సంక్రాంతి, కనుమ అని మూడు దివసములుగా జరుపుకుంటారు. భోగి రోజున ఇంటి ఆవరణలో ముగ్గులు వేస్తారు. కొత్త ఆవుపేడతో గొబ్బిళ్ళను చేసి, వాటిని ముగ్గుల మధ్యలో పెట్టి, గౌరమ్మగా పూజిస్తారు. పాత పనికిరాని వస్తువులను అగ్నిలో వేస్తారు. ఆ అగ్నితో వేడి చేసిన నీటితో స్నానమాచరిస్తారు.సంక్రాంతి రోజున కొత్త బట్టలు ధరిస్తారు. రకరకాల వంటకాలను భగవంతుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. పెద్దలను స్మరించి కొత్త బట్టలను సమర్పిస్తారు. కనుమ నాడు వ్యవసాయానికి సంబంధించిన పశువులను పూలతో, పసుపు కుంకుమలతో అలంకరించి పూజించి కృతజ్ఞతలను తెలియజేస్తారు. వేర్వేరు పేర్లతో దేశవ్యాప్తంగా ఈ పండుగను జరుపుకుంటారు. గుజరాత్‌లో ఈ రోజు గాలిపటాలను ఎగరేస్తారు. తమిళనాడులో ఈ పండుగను పొంగల్ అని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళలో సంక్రాంతి అని పిలుస్తారు. రాజస్థాన్, బీహార్, ఝార్ఖండ్‌లో సకరాత్, ఉత్తరాఖండ్‌లో ఖిచ్డీ సంక్రాంతి అని, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఒడిశా, మహారాష్ట్రలో కూడా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ సంక్రమణ సమయంలో జపం, తపస్సు, దానం, స్నానం, శ్రాద్ధం, తర్పణం వంటి క్రియలు ప్రత్యేకమైన పుణ్యాన్ని ఇస్తాయి. నువ్వులను మకరసంక్రాంతి నాడు ఉపయోగించాలి. నువ్వులను స్నానాదులకు, భోజనాదులకు వాడడం వల్ల పుణ్యం లభిస్తుంది.ప్రయత్నానికి మించిన ప్రత్యామ్నాయం లేదు. ఫలం ఆశించకుండా పనిచేసేవారికి విజయం లభిస్తుంది. సత్కర్మాచరణమే భగవత్సేవ. భగవంతుడు సర్వజ్ఞుడు. ఎవరికి ఏమి ఇవ్వాలి అనేది వారి అర్హతలను బట్టి నిర్ణయిస్తాడు. భగవంతుని దయ, గురుకృప ఉంటే ప్రపంచమంతా అడ్డగించినా మనకు రావాల్సింది వచ్చి తీరుతుంది. భగవంతుని అనుగ్రహం, గురు కటాక్షం లేకపోతే ప్రపంచమంతా సహకరించినా మనకు రావాల్సింది రాదు అన్న పరమ సత్యాన్ని మనం విశ్వసించాలి. అదే ప్రణవపద్మాకరం అందించే బోధనామృతం.సనాతనధర్మాన్నీ,వేదపురాణేతిహాసాలను పాడుచేయడానికి పూనుకొనే రాక్షసశక్తులు నశించాలి. సత్యధర్మాలను ఆచరించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం



శ్లో॥ తచ్ఛరామ వచః శ్రుత్వా జిత క్రోధో గణేశ్వరః
శుద్ధ సత్త్వ స్వరూపశ్చ ప్రహస్య తమువాచ హ ॥
(బ్రహ్మవైవర్తపురాణం. ఖండం.3.అ.42.శ్లో.33)

పరశురాముని మాటలు విన్నాడు గణేశుడు.ఆయన క్రోధాన్ని జయించినవాడు. శుద్ధసత్త్వస్వరూపుడు. సాత్త్వికులు ఆత్మావశ్యక స్థితిలో తప్ప కోపాన్ని పొందరు. పరశురాముడు శివభక్తుడు అవ్వడం వల్ల, విష్ణుని అవతారం అవ్వడం వల్ల గణపతి మరలా శాంతంగా ఆయనతో ఇలా అన్నాడు. ఎంతటి అజ్ఞాని అయినా తండ్రి వల్ల, అన్న గారి వల్ల జ్ఞానాన్ని పొందగలుగుతాడు. తండ్రి, సోదరులు జ్ఞానులు అయితేనే ఇది సాధ్యమవుతుంది. లోకాలకు మూలకారకుడు, సకల వేదశాస్త్రాలకు నిలయుడు అయిన ఈశ్వరునికి నీవు ఆత్మీయ శిష్యుడివి కాబట్టి పుత్రసమానుడివి. ఆయన వల్ల విశిష్ట జ్ఞానాన్ని పొందావని విన్నాను. కనుక నా మాటలను గ్రహించు. పరబ్రహ్మనిర్గుణుడిగా ఉన్నప్పుడు ఆయనకు ఏ నియమాలు ఉండవు. ఆయన నిర్లిప్తుడు. శక్తి అవసరం నిర్గుణపరబ్రహ్మానికి ఉండదు. సృష్టికార్యాలు చేయడం కోసం, శక్తితో కలసి సగుణుడుగా పరబ్రహ్మ మారతాడు. అప్పుడు సగుణరూపునకు కూడా కొన్ని నియమాలు ఉంటాయి. ప్రాణుల శరీరాలలో శ్రీకృష్ణుడు చైతన్యరూపంతో ఉన్నంత వరకు ఆ శరీరాలు కదులుతాయి. ఆయన తప్పుకుంటే శవాలు అవుతాయి. ప్రాణంతో ఉన్న శరీరాలకు కట్టుబాట్లు ఉంటాయి. ప్రాణం పోయాక శవాలకు విధి నిషేధాలుండవు. ఈ విధంగానే త్రిమూర్తులు కూడా గుణరూప కర్మలు కలిగిన సగుణాకారాలు ధరించినంత వరకు కొన్ని నియమాలు ఏర్పాటు చేసుకొన్నారు. శివుడు ఆ నియమాన్ని అనుసరించి యోగ నిద్రలో ఉన్నాడు. ఈ సమయంలో ఎంతటి వారికైనా ప్రవేశం నిషిద్ధమే. కించిత్ కాలం ఆగితే స్వామి వారి నిద్ర పూర్తి అవుతుంది. అప్పుడు నీకు ప్రవేశం కలుగుతుంది.

గణపతి మాటలు విన్నప్పటికీ రామునకు శాంతం కల్గలేదు. గండ్ర గొడ్డలి చేత ధరించి గణేశుని లెక్క చేయక శివుని మందిరంలోనికి వెళ్ళబోయాడు. గణపతి బలం ఉపయోగించి పరశురాముని అడ్డగించాడు. పరశురాముడు గండ్ర గొడ్డలిని ఎత్తాడు. కుమారుడు హాహాకారం చేసి పరశురామా! ఆగు అన్నాడు. నీ పరశువు అమోఘమైన అస్త్రం. అది ప్రయోగిస్తే వ్యర్థం కారాదని శివుని వరం. కనుక అది గణపతికి బాధ కలిగిస్తుంది. గురువును గౌరవించినట్లే గురువుల సంతానాన్ని గౌరవించాలి.

శ్లో॥ గురువద్గురుపుత్రంచ మా భవాన్ హంతుమర్హతి ॥
(బ్ర.వై.పు.ఖం.3.అ.43.శ్లో.5)

గురువును చంపకూడదని శాస్త్రం. అలాగే గురుపుత్రకులను కూడా, అని కుమారుడు పలికాడు. క్రోధంతో ఉన్న పరశురాముడు ఎవ్వరి మాటలూ వినలేదు. గండ్ర గొడ్డలి ఎత్తి గణపతిపైకి వెళ్ళాడు. గణపతి ధర్మస్వరూపుడు. క్రోధం ఏమాత్రం దరిచేరదీయని మహాత్ముడు.

....ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## దానాలు – ఫలితాలు



హేమాంగుడు దీనంగా ప్రార్థించగా విన్న శ్రుతదేవుడు తన దివ్య విజ్ఞాన దృష్టితో — అతని దుర్గతులకు గల కారణాలను గ్రహించాడు. అతనితో ఇలా అన్నాడు — రాజా! నీ కులగురువైన వశిష్ఠుడు ఇచ్చిన సలహాని ధిక్కరించి ఇలా అధోగతుల పాలయ్యావు. గురువును మించిన దైవం లేదనే విషయం మరచిపోయావు. నీ గురువు నీకు జలదానం చెయ్యమని చెప్పాడు. కాని నీవు వినలేదు.

శ్లో॥ శ్రుణు భూప ప్రవక్ష్యామి తవ దుర్గతి కారణమ్ ।
న జలం తు త్వయా దత్తం వేంకటాహ్వాయ భూధరే ॥
శ్లో॥ తజ్జలం సులభం మత్వా న మౌల్యమితి నిశ్చితః ।
నాధ్వగానాం ద్విజాదీనాం ఘర్మ కాలే ఉష్యజా నతా ॥

(శ్రీ స్కం.పు.వై.ఖం.అ.16.శ్లో.30,31)

రాజా! నీ దుర్గతికి కారణం చెపుతున్నాను. విను. వేంకటాచలం పై జలదానం చేయమని గురువు చెప్పినా వినలేదు. జలదానం చేయలేదు. నీరు పెద్దగా విలువైనది కాదనీ, ఎక్కడ బడితే అక్కడే దొరకుతుందనీ నీ భావం. ఇలా నిశ్చయించుకొని చేజేతులారా ముప్పు తెచ్చుకొన్నావు. బాటసారులకు, విప్రులకు, వేసవికాలంలో ఎంత దాహంతో అల్లాడిపోతున్నా మంచినీరు త్రాగడానికి ఇవ్వలేదు, పట్టించుకోలేదు. వేసవిలో ఎంత ధనవంతునికైనా సమయానికి నీరు లేకపోతే ప్రాణం నిలుస్తుందా? ధనం ప్రాణాన్ని నిలుపుతుందా? విలువ లేని వస్తువుగా నీవు భావించిన నీరు అమృతం అని పిలువబడుతుంది. అది ప్రాణాలకు ఆధారం. జలం, అన్నం, జీవులను బ్రతికించే బ్రహ్మపదార్థాలు. ఈ విషయం నీకు అర్థం కాలేదు. అర్హులకు నీటిని దానం చేయక, అపాత్రులకు అనేక దానాలు, ఎన్నెన్నో వస్తువులు ఇచ్చావు. అగ్నిలో మండుతున్న నేతిని పోసి యజ్ఞం చేస్తే దేవతలు సంతృప్తి పొందుతారు. బూడిదలో పోస్తే అది యజ్ఞం కాదు. వ్యర్థం. శ్రమతో జీవించేవారి కడుపులో మండుతున్న దప్పిక అనబడే అగ్నిని జలంతో తృప్తి పరచి చల్లార్చడం ఒక మహాయజ్ఞం. ఈ యజ్ఞం, ముందు ఇహం తరవాత పరం అందిస్తాయి. అందుకే మహాత్ములు వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహంతో ఉన్న వారిని రక్షిస్తారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం దేవాలయ నిర్మాణంతో సమానమైనది. మంచి నీరు అందించడం నిత్యం భగవంతునికి షోడశోపచారాలు చేయడం వంటిది. తులసీదళాలతో భగవంతుని పూజించక దేవదారు చెట్టు ఆకులతో పూజిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. అలాగే జలదానం చేయక తక్కిన దానాలు చేయడం వల్ల పెద్దగా ఫలితం రాదు. అనగా జలదానం చేసిన తరవాత తక్కిన దానాలు చేస్తే, ఆ దానాలు అనంత ఫలితాన్ని ఇస్తాయి. అందరిపై దయచూపాలి.

....ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## ఉత్తర



వేదవ్యాస విరచిత మహాభారతంలో, భారతీయుల జీవితంలోని వివిధ సందర్భాలలో అనేక పాత్రలు నృత్యం చేస్తూ ఉంటాయి. శౌర్యానికి అర్జునుడు, దాతృత్వానికి కర్ణుడు, సహనం మరియు భక్తికి కుంతి వంటి పేర్లు, పాంచాలికి ద్రౌపది వంటి వీరోచిత పాత్రలను భారతీయ ప్రజలు ఎల్లప్పడూ గుర్తుంచుకుంటారు. భారతంలో మనం మర్చిపోలేని పాత్రలు కొన్ని ఉన్నాయి. పాండవ వంశ సంప్రదాయాన్ని ముందుకు తీసుకువెళ్లిన స్వచ్ఛమైన పాత్రలలో ఒకటి ఉత్తర. ఉత్తర మహావీరుడు అభిమన్యు భార్య మరియు పరీక్షిత్ మహారాజు తల్లి. విరాట నగర రాజు విరాటుడు మరియు రాణి సుధేష్ణల పుత్రిక ఉత్తర. విరాట నగర యువరాజు ఉత్తర కుమారుని సోదరి. పాండవులు తమ అజ్ఞాతవాసం గడపడానికి విరాటనగరంలోకి ప్రవేశించినప్పుడు, మహావీరుడు అర్జునుడు ఊర్వశి శాపం కారణంగా బృహన్నల పేరుతో విరాటరాజు ఆస్థానానికి వచ్చి నృత్యం, పాట మరియు సంగీతం మొదలైన వాటిలో నైపుణ్యం కలిగిన నపుంసకుడుగా ప్రకటించుకున్నాడు. తాను శాపగ్రస్తుడైనందున తాను ఏ పనీ చేయలేనని, అందుకే చిన్నప్పటి నుండి నాట్యం వంటి కళలు నేర్చుకుని అంతఃపుర రాజ బాలికలకు నాట్యం నేర్పించడంలో నేర్పరినని చెబుతాడు. అప్పుడు విరాటరాజు యువరాణి ఉత్తరకు నృత్యం నేర్పించే బాధ్యతను బృహన్నలకు అప్పగిస్తాడు. ఆ సమయంలో విరాటరాజు ఉత్తరను బృహన్నలకు ఉత్తర గురించి ఇలా అంటాడు – "ఉత్తర ఎప్పుడూ తన స్నేహితులతో అల్లరి చేస్తూనే ఉంటుంది. క్రమశిక్షణ చాలా తక్కువ. కాబట్టి ఇక నుంచి ఆమె దృష్టిని నృత్యం, పాట మరియు సంగీతం వైపు మళ్లించడం మీ బాధ్యత. విరాటరాజు ఉత్తరతో ఇలా అన్నాడు ఉత్తరా! నేటి నుండి ఆయనే మీకు గురువు. ఆమె సలహా మేరకు నాట్యం బాగా నేర్చుకో. ఎల్లప్పడూ గురువుగారి మాటలను విను.

..ఇంకాఉంది

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 339 . విష్ణుమాయా – [ఓం ఐం హ్రీం శ్రీం విష్ణుమాయాయై నమః]



శ్రీమహావిష్ణువు వద్ద ఒక మాయ ఉంది. ఆ మాయను విష్ణుమాయ అంటారు. ఆ మాయను ఆశ్రయించుకొని ఆయన రూపం ధరించాడు. అవతారాలు ఎత్తుతున్నాడు. నిజానికి విష్ణువు అనే శబ్దానికి అంతటా వ్యాపించి ఉన్నవాడు. అపరిమితుడు అని అర్థం. ఆయనను కూడా ఒక పరిమిత రూపుడిని చేస్తున్నది ఈ విష్ణు మాయయే. ఈ మాయ ఆయన అధీనంలో ఉంటుంది. ఆయన ఆ మాయాధీనుడు. విష్ణువు – విష్ణుమాయ పరస్పర పూరకాలు. విష్ణుని అనుగ్రహం లేనిదే ఈ మాయ నుండి బయటపడలేరు. కారణం ఈ మాయ సంపూర్ణంగా ఆయన అధీనంలో ఉండడమే. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు –

శ్లో॥ దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే ॥

త్రిగుణాలతో కూడిన దేవసంబంధమైన నా మాయను సామాన్యులు దాటలేరు. నన్ను శరణు పొందినవారు ఈ మాయను సులభంగా దాటుతున్నారు. అమ్మవారు తానే విష్ణుస్వరూపిణి, తానే విష్ణుమాయాస్వరూపిణి. పోషించేటప్పుడు గోవింద రూపంలో ఉంటున్నట్లుగా ఇంతకు ముందు శ్రీలలితాసహస్రనామస్తోత్రంలోని 63 వ శ్లోకంలో చెప్పబడి ఉంది. కాళికాపురాణంలో త్రిగుణాలతో నిండి వ్యక్తం, అవ్యక్తం అవుతూ విష్ణుమాయ ప్రవర్తిస్తుందని వ్యాసుడు వివరించాడు.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

ఈ యుగంలో మానవులు ఏ పని చేయాలో, చేయకూడదో నిర్ణయించుకోలేకున్నారు. ఏది మంచో, ఏ పని చెడో గ్రహించలేకపోతున్నారు. సరియైన నిర్ణయం తీసుకోలేక, జీవితాలు పాడుచేసుకొనే వారు ఎక్కువైపోయారు. తమ జీవితాన్ని సరిచేసుకొనే సరియైన నిర్ణయం తీసుకోవడానికి ఈ మంత్రాన్ని జపించాలి. అమ్మవారి పటం లేక విగ్రహాన్ని ఎదురుగా పెట్టుకొని ద్రాక్షాఫలాలు నివేదించాలి. (ఎండు ద్రాక్షకూడా పనికొస్తాయి) నలభై దినాల పాటు ఈ మంత్ర జపం చేసి, జపానంతరం అమ్మవారి ప్రసాదంగా ద్రాక్షాఫలాన్ని తినాలి. ఇలా జపం చేసిన వారికి సరియైన నిర్ణయం తీసికొనే శక్తి వస్తుంది. జీవితం ఆనంద మయం అవుతుంది.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు


# ఋషి చరిత్ర

## భృగు మహర్షి

భృగుమహర్షి యొక్క ఈ పరీక్షలతో కోపగించిన మరీచిమహర్షి , ధర్మారణ్యంలో తపస్సు చేసి, పాపాల నుండి విముక్తి కోసం గంగా తీరానికి వెళ్ళమని కోరాడు. ఈ విధంగా భృగుమహర్షి తన రెండవ భార్య పౌలమితో గంగా తీరానికి వచ్చాడు. ఇక్కడ గురుకులాన్ని తెరిచాడు, ఆనాటి ప్రజలకు వ్యవసాయం చేయడం తెలియదు. వారికి అడవిని బాగుచేసి వ్యవసాయం నేర్పించాడు. ఇక్కడే ఉంటూ జ్యోతిష్య గ్రంథం 'భృగు సంహిత'ను రచించాడు. తన జ్యోతిషశాస్త్ర లెక్కల ద్వారా ఇక్కడ ప్రవహించే గంగా నది కొంతకాలం తర్వాత ఎండిపోతుందని తెలుసుకొని, తన శిష్యుడైన దర్దరుని పంపి అప్పట్లో అయోధ్య వరకు ప్రవహిస్తున్న సరయూ నదిని ఇక్కడికి తీసుకొచ్చి గంగా - సరయు సంగమాన్ని చేసాడు.

భృగుమహర్షి గణేశుడి సహాయంతో విశ్వంలో జన్మించిన మరియు పుట్టబోయే అన్ని జీవుల జాతకాలను ఇప్పటికే సిద్ధం చేసారు. 'భృగు సంహిత' సహాయంతో, వ్యక్తుల యొక్క మూడు జన్మల ఫలితాన్ని తెలుసుకొనవచ్చు. ఈ విశ్వాన్ని నియంత్రించే సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని మొదలైన గ్రహాలు మరియు నక్షత్రరాశుల ఆధారంగా వేద గణిత శాస్త్రానికి సంబంధించిన ఈ శాస్త్రీయ గ్రంథం ద్వారా, జీవితానికి మరియు వ్యవసాయానికి వర్షపాతం మొదలైన వాటి గురించి అంచనా వేయవచ్చు. భృగు మహర్షి రచించిన 'భృగు సంహిత' నేటికీ మనకు ఆదర్శప్రాయంగా ఉందంటే ఆయన గొప్పతనాన్ని అంచనా వేయవచ్చు.

భూమిపై మొదటిసారిగా మహర్షి భృగువు నిప్పును ఎలా వెలిగించవచ్చో, మనం నిప్పును ఎలా ఉపయోగించాలో తెలియజేసినవాడు. ఈ కారణంగా, భృగు వంశస్థులు అగ్నిని ఆరాధించడం ప్రారంభించారు. సంజీవని విద్యను కూడా భృగువు కనుగొన్నాడని చెబుతారు. అంటే చనిపోయిన జీవిని తిరిగి బతికించే మార్గాన్ని కనిపెట్టింది ఆయనే. సాంప్రదాయకంగా ఈ జ్ఞానం అతని కుమారుడు శుక్రాచార్యకు అందించబడింది. మహర్షి భృగువుకు కూడా ఆయుర్వేదంతో సన్నిహిత సంబంధం ఉంది. అధర్వణవేదం మరియు ఆయుర్వేదానికి సంబంధించిన పురాతన గ్రంథాలలోచాలా చోట్ల ఆయనను ప్రామాణికమైన ఆచార్యుడిగా పేర్కొనడం జరిగింది. భృగుమహర్షి సూర్యకిరణాల ద్వారా రోగాలను నయం చేయడం గురించి చర్చించారు



★★★★★★

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు


# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

**వి**కృత ఆకృతి కలిగిన పిశాచమును చూసి భయపడకుండా వాల్మీకి అను బ్రాహ్మణుడు ఈ విధంగా పలికెను " నీ పై జాలి,దయ కలిగి అడుగుతున్నాను ,నేను నీకు ఎటువంటి హాని చేయను ఎవరు నీవు? ఎక్కడినుండి ఇక్కడకు వచ్చావు? నీకు ఇటువంటి దీన స్థితి ఎందుకు కలిగింది?నేను విభూతి దారణ చేయువాడను, శివ సహస్రమును చేయువాడను, నీవు నన్ను ఏమీ చేయలేవు.నాకు నీవలన ఎటువంటి భయము లేదు". వాల్మీకి మాటలు విన్న పిశాచి ఈ విధంగా పలికింది "ఓ బ్రాహ్మణోత్తమా, తాపసోత్తమా మీ దయ చాలా గొప్పది.నేను నా వృత్తాంతమును మీకు చెప్పున్నాను,దయ తో వినండి. గోదావరి తీరాన ప్రతిష్టానపురము అను స్థానము ఉన్నది.అక్కడే నా నివాసము. నేను ఒక బ్రాహ్మణుడను, అక్కడ గల ఒక తీర్థములో దానములను తీసుకునే వాడను,ఆ కర్మ ఫలమే మీముందు ఉన్న నా వికృత ఆకారము.దానములను స్వీకరించువారు, ముఖ్యముగా తీర్థముల వద్ద దానములు స్వీకరించే వారు,స్వీకరించిన దానములో కొంత పర్వ కాలములలో దానము చేయాలి,చేయని వారికి రాక్షస జన్మ లేదా పిశాచ జన్మ వస్తుంది. చెట్లు,నీరూ లేని ఏడారిలో చాలా కాలము పిశాచముగా నివసించితిని.ఆకలిదప్పులు వలన తీవ్ర బాధలను అనుభవించితిని.ఈ విధంగా బాధలను అనుభవిస్తున్న నాకు ఒకనాడు సూర్యోదయ కాలంలో సంధ్య చెయ్యని, మల మూత్ర విసర్జన తర్వాత శౌచమును పాటించని వాడిని నేను చూసితిని. సంధ్యాహీనులను పట్టుకునే అవకాశం నాకు ఉండటం వలన భోగములకు ఆశపడి అతని శరీరంలో ప్రవేశించాను.ధనము కొఱకు ఆ బ్రాహ్మణుడు ఒక వ్యాపారితో కలసి కాశీ లో ప్రవేశించాడు. కాశీలో రాక్షసులకు, పిశాచములకు ప్రవేశము లేదు.కాశీ నుండి అతడు బయటకు ఎప్పుడు వచ్చునా అని అతడి పాపములు, నేను ఎదురుచూడ సాగాము. ప్రస్తుతం నేను నీ ముందు ఉన్నాను, ఆ బ్రాహ్మణ కుమారుడి పాపములు ఇంకా అతడి కోసమే ఎదురు చూస్తూ ఉన్నవి, కానీ ఇంత వరకు అతడు బయటకు రాలేదు. ఓ మహర్షి!ఈరోజు నేను మీకు ఒక అద్భుత ఘట్టమును వివరిస్తాను, ఇతడి కోసం కాశీ బయట ఎదురు చూస్తూనే నేను ఆకలి బాధలు తీర్చుకుందాం అని రోజూ ప్రయాగ వరకు వెళ్లి వచ్చేవాడిని. కానీ ఎక్కడా ఆహారము దొరకలేదు.తినడానికి మార్గం మధ్యలో అనేక ఫలములు కలిగిన వృక్షములు,జలములు అనంతముగా ఉన్నవి,కానీ నేను సమీపించగానే దూరం జరిగిపోయేవి. ఈరోజు దైవానుగ్రహం వలన ఒక సన్యాసి కనిపించాడు.ఆకలికి అతడిని బలవంతంగా మ్రింగుదామని అతని మీదకు వెళ్ళాను, కానీ నేను సమీపించగానే ఆ సన్యాసి శివా అన్నాడు,ఆయన శివనామం చేయగానే నేను దూరంగా నెట్టివేయబడ్డాను, మళ్ళీ సమీపించి మ్రింగబోగానే మళ్ళీ నెట్టివేయబడ్డాను. అలా శివ నామస్మరణ చేసుకుంటూ కాశీ వరకు చేరుకున్నాము,ఆయన అంతర్గృహమునకు వెళ్లి పోయెను.పిశాచం అవ్వడం వల్ల నాకు ప్రవేశం లేదు, ఆ సన్యాసితో పాటు శివస్మరణ చేసుకుంటూ కాశీ వరకు రావడం వలన నాకు పంచక్రోశము వరకు అనుమతి లభించింది. ఆ తర్వాతే మీరు నా భాగ్యం కొద్దీ నన్ను చూసి నాపై దయతో నన్ను గురించిన విషయాలను అడిగారు.ఇది ఈ రోజున జరిగింది. ఓ మహాత్మా నన్ను అనుగ్రహించండి". పిశాచి కథను విన్న వాల్మీకి నీకు శివానుగ్రహము కొఱకు మార్గము చూపిస్తాను.

...ఇంకావుంది

# స్తోత్రమాలిక

## శ్రీ గణనాయకాష్టకమ్



1. ఏకదంతం మహాకాయం తప్తకాంచనసన్నిభమ్ l

   లంబోదరం విశాలాక్షం వందేహం గణనాయకమ్ ll

2. మౌంజీ కృష్ణాజినధరం నాగయజ్ఞోపవీతినమ్ l

   బాలేందుశకలం మౌళౌ వందేహం గణనాయకమ్ ll

3. చిత్రరత్నవిచిత్రాంగం చిత్రమాలా విభూషితమ్ l

   కామరూపధరం దేవం వందే హం గణనాయకమ్ ll

4. గజవక్త్రం సురశ్రేష్ఠం కర్ణచామర భూషితమ్ l

   పాశాంకుశధరం దేవం వందేహం గణనాయకమ్ ll

5. మూషకోత్తమమారుహ్య దేవాసురమహాహవే l

   యోద్ధుకామం మహావీరం వందేహం గణనాయకమ్ ll

6. యక్షకిన్నర గంధర్వ సిద్ధవిద్యాధరైస్సదా l

   స్తూయమానం మహాబాహుం వందేహం గణనాయకమ్ ll

7. అంబికాహృదయానందం మాతృభిః పరివేష్టితమ్ l

   భక్తప్రియం మదోన్మత్తం వందేహం గణనాయకమ్ ll

8. సర్వవిఘ్నహరం దేవం సర్వవిఘ్న వివర్జితమ్ l

   సర్వసిద్ధిప్రదాతారం వందేహం గణనాయకమ్ ll

   గణాష్టకమిదం పుణ్యం యః పఠేత్ సతతం నరఃl

   సిద్ధ్యంతి సర్వకార్యాణి విద్యావాన్ ధనవాన్ భవేత్ ll

## పంచవింశతిః అధ్యాయః

# గురుదేవుల జీవన కవనము



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు అనేక శతావధానములు చేసారు. శతావధానములలో వారికి వారే సాటి, వారి పాండిత్యానికి ఎదురు నిలిచి వచ్చే వారు ఎంత వెతికినా కనిపించరు. పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు అవధానములలో అనేక ప్రత్యేకతలను చాటుకుంటారు,అది తెలుగు భాషను ఆస్వాదించే భాషా ప్రియులకు మాత్రమే అర్థం అవుతుంది.గురుదేవుల జంటావధానముల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి,చిరంజీవి భరత్ శర్మతో వారు బళ్లారిలోనూ, దుబాయిలోనూ జంటావధానములు నిర్వహించారు. ఒక్కరే అవధానిగా శతావధానం చేయటం సులభమైన ప్రక్రియ కానీ జంటావధానములు చేసేటప్పుడు పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు వంటి పండితులకు అది గొప్ప ప్రయోగం అనే చెప్పవలసి ఉంటుంది.గురుదేవుల పాండిత్యానికి సాటి వచ్చేవారు ఎవ్వరూ లేరు అటువంటిది వారితో సమాన ఆసనం పైన కూర్చుని జంటావధానం నిర్వహించడము అంటే రెండవ అవధానికి ఎంతో కష్టమైన ప్రక్రియ.గురుదేవుల శతావధానముల సంఖ్యతో సమానమైన వయసు కూడా లేని చిరంజీవి భరత్ శర్మ గారితో కలిసి వారు 2024వ సంవత్సరంలో నిర్వహించిన బళ్ళారి శతావధానం ఒక దిగ్విజయమైన శతావధాన కార్యక్రమం.తెలుగు, కన్నడ కలయికతో ఏర్పాటు అయిన పవిత్ర ప్రదేశం బళ్ళారి పట్టణం. అటువంటి పట్టణములో కూడా జంటావధానం చేయటం అంటే అది గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారికి మాత్రమే సాధ్యం.దుబాయిలో కూడా 2024వ సంవత్సరం భరత్ శర్మ గారితో జంటావధానమును నిర్వహించారు పూజ్య గురుదేవులు,ఎక్కడి తెలుగుదేశము! ఎక్కడి మధ్య ఆసియా ప్రాంతము! తెలుగు భాషను ప్రపంచ భాషగా తీర్చి దిద్దుతున్న పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారికి తెలుగు ప్రజలు ఎప్పుడూ ఋణపడి ఉంటారు. సింగపూర్, దుబాయ్ , బళ్లారి, అమెరికా ఎక్కడైనా సరే తెలుగు భాష ఎక్కడ ఉంటే అక్కడ గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఉంటారు.పూజ్య గురుదేవులు అవధాని మాత్రమే కాదు అష్టాదశ పురాణములను ఒకటికి మూడు సార్లు చెప్పిన మహా పండితులు. గురుదేవులు చిరంజీవి భరత్ శర్మను తన స్థాయికి అవధానములో తీసుకొని వచ్చి, భరత్ శర్మను కూడా తన స్థాయిలో ధారణ చేయించగలిగారు.అవధాన కళలో క్రొత్త తరం వారిని కూడా తయారు చేస్తూ వారికి మార్గ నిర్దేశంకూడా చేస్తున్నారు.

.. ఇంకా ఉంది